కథ

# చైతన్య ప్రవంతి

డా॥ కొమ్మిశెట్టి మోహన్

అది తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళ్ళే ట్రెయిన్. సెకండు క్లాసు రిజర్వేషన్ కంపార్టుమెంటులో నేనూ, శాంతీ సామాను సర్దుకుని ఊపిరి పీల్చుకున్నాము.

ఇంతలో 'టికెట్... టికెట్ ప్లీజ్!' అంటూ. టికెట్ ఎగ్జామినర్ వచ్చాడు. అతను ఒక్కొక్కరి టికెట్టు తీసుకుని, తన చార్ట్‌లో సరిజూసుకుని, ఒక గీత లాంటి సంతకం చేసి తిరిగి ఇస్తున్నాడు. నేనూ టికెట్టు తీసి ఇచ్చాను. అతను నా ముఖంలోకి చూసి టికెట్టు తీసుకుని చార్ట్‌లో సరిజూసుకోసాగాడు. అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినవాడిలా ఠక్కున మళ్ళీ నా ముఖంలోకీ, ప్రక్కనే వున్న శాంతి ముఖంలోకి మార్చి మార్చి చూడసాగాడు. ఏదో గుర్తొచ్చినవాడిలా, ఆశ్చర్యం, ఆనందం కలబోసిన ముఖంతో "మాస్టారూ... మీరు... మీరు... రఘురాంగారు... అమ్మగారు... శాంతమ్మగారు..." అంటూ తడబడుతున్నాడు.

నేనప్పుడు అతని ముఖంలోకి పరిశీలనగా చూశాను. అతనికి దాదాపు 35 సంవత్సరాలుంటాయి. ఎక్కడో చూసిన ముఖంలా అనిపిస్తోంది. కానీ ఎక్కడ...? 'ఎవరన్నట్లు' ప్రశ్నార్థకంగా నేను శాంతి ముఖంలోకి చూశాను. కానీ ఆమెకూ గుర్తుకొచ్చినట్లు లేదు.

నేనిలా ఆలోచిస్తూ వుండగానే, అతను మళ్ళీ, "మాస్టారూ! అమ్మగారూ! నన్ను గుర్తుపట్టలేదా. నేను... నేను, మీ చైతన్యను..." అంటూ ఠక్కున నాకూ, శాంతికీ పాదాభివందనం చేశాడు.

నా మస్తిష్కంలో ఏదో ఫ్లాష్‌లా వెలిగింది. 'చైతన్య...' అంతే, ఆనందాతిశయంతో ఆ అబ్బాయిని కౌగిలించుకున్నాను.

"నువ్వు... చైతన్య... మా చైతన్య..." నా కళ్ళను నేనే నమ్మలేకపోతున్నాను. శాంతి కూడ ఏదో గుర్తొచ్చినదానిలా అంది, "అవున్రా అబ్బాయ్! మేం నమ్మలేకపోతున్నాం". శాంతి ఆప్యాయంగా అతని రెండు చేతులూ పట్టుకుంది.

అప్పుడతను డ్యూటీలో నున్న ఒక బాధ్యతగల ఆఫీసరులా ఎవరికీ అనిపించలేదు. ఎప్పుడో చిన్నప్పుడు తప్పిపోయి, ఎన్నో ఏళ్ళ తర్వాత తల్లిదండ్రులను కలుసుకున్న కుర్రాడిలా అనిపించాడు. తప్పిపోయిన అబ్బాయిని ఇన్నేళ్ళ తర్వాత తిరిగి పొందిన తల్లిదండ్రుల్లా వుంది మా పరిస్థితి. కంపార్టుమెంటులోని వారంతా మా వైపే చూడసాగారు. ఆ భావోద్వేగపూరిత సన్నివేశం నిజంగానే అందరిలోనూ ఒక అనిర్వచనీయమైన మానవతా భావాన్నీ, ఆసక్తినీ, జిజ్ఞాసనీ ఆవిష్కరించింది.

"అవును, మాస్టారూ! నేను, మీ చైతన్యనే.. ఎలా వున్నారు మాస్టారూ?...అమ్మా, ఎలా వున్నారు...?"

"మేం బాగానే వున్నాం. నీ సంగతులే వినాలని కుతూహలంగా వుంది".

"మీరెంతవరకు వస్తున్నారు, మాస్టారూ?"


"హైదరాబాదు"

"అలాగా! నేను కూడ హైదరాబాదులో డ్యూటీ దిగుతాను. స్టేషన్‌లో దిగిన తర్వాత మనం వివరంగా మాట్లాడుకుందాం" అన్నాడు.

తర్వాత చైతన్య మళ్ళీ "టికెట్... టికెట్ ప్లీజ్..." అంటూ మరో కంపార్టుమెంటులోకి వెళ్ళిపోయాడు.

నేనూ, శాంతీ, ఇంకా ఆనందాశ్చర్యాల నుంచీ పూర్తిగా తేరుకోలేకపోతున్నాము. కంపార్టుమెంటులోనివారు చాలమంది అప్పుడే పడకలు సర్దుతున్నారు. ఈ లోకంలోకి వచ్చినట్లు నేను టైం చూశాను. పది గంటలు కావస్తోంది.

"త్వరగా భోంచేద్దాం. హైదరాబాద్ స్టేషన్ వచ్చేలోగా మళ్ళీ తెల్లవారుఝామునే లేవాలి" శాంతి పురమాయించింది. ఇద్దరం ఇంటి నుంచి ప్యాక్ చేసి తెచ్చుకున్న పెరుగన్నం తిని, బెర్తులు సర్దుకుని, నడుం వాల్చాము. నేను మెల్లగా కండ్లు మూసుకున్నాను: గతంలోని సంఘటనలెన్నో స్మృతి పథంలో కదలాడసాగాయి.




***

దాదాపు పాతిక సంవత్సరాల క్రితం. నేను కుటుంబంతో బంధువుల పెళ్ళికి వెళ్ళి, విజయవాడ నుంచి తిరుపతికి రైళ్ళో తిరుగు ప్రయాణం చేస్తున్నాను. ఉదయం 10 గంటలు కావస్తోంది. రైలు విజయవాడ స్టేషన్‌లో చాలసేపు ఆగింది. టిఫిన్లు, కాఫీలు, అమ్మేవారి అరుపులు, తోపులాటలతో ఊపిరాడనివ్వలేదు. ట్రెయిన్ కదిలి వేగం పుంజుకున్న తర్వాత కొంతసేపటికిగానీ ప్రశాంతత ఏర్పడలేదు. సద్దు మణిగింది కానీ కంపార్టుమెంటంతా చాల రోతగా తయారయింది. ఎంగిలి కాఫీకప్పులు,

ఎంగిలి ఆకులు, కాగితాలు, ఖాళీ వాటర్ బాటిళ్ళు, పండ్లతొక్కలు, వాటికితోడు నీటి తేమ, ఒకటేమిటి, రకరకాల వ్యర్థ పదార్థాలతో కంపార్టుమెంటు మురికిగా తయారయింది.

ఇంతలో పదేళ్ళ పిల్లవాడు కంపార్టుమెంటులో అందరి కాళ్ళ మధ్యకి దూరి, సీట్ల క్రింద శుభ్రం చేయసాగాడు. వాడలా ఆ మురికినంతా శుభ్రం చేస్తూవుంటే నా కడుపులో దేవినట్లయింది. 'కోటి విద్యలు కూటికొరకే', అని పెద్దలు వూరికే అనలేదనిపించింది. వాడు పని పూర్తి చేసి దీనంగా అందరివైపు చేయి సాచాడు. కొందరు రూపాయో, అర్థ రూపాయో, ఇచ్చారు. మరికొందరు గమనించనట్లే వుండిపోయారు. ఇంకొందరు పురుగును చూసినట్లు అసహ్యంగా ముఖం చిట్లించి, లేదన్నారు. వాడు నా వైపు దీనంగా చూస్తూ చేయి సాచాడు. నేను వాని ముఖంలోకి పరిశీలనగా చూశాను. తైల సంస్కారం లేని చింపిరి జట్టు, మోకాళ్ళ వరకు మడిచిన మురికి ప్యాంటు, ఒంటిపై చొక్కా లేదు. స్నానం చేసి ఎన్నాళ్ళో అయినట్లుంది. ఒక గుడ్డపేలిక నడుముకు బిగించాడు. అదే వాని జీవితాధారం. అదే



*ఇంతలో పదేళ్ళ పిల్లవాడు కంపార్టుమెంటులో అందరి కాళ్ళ మధ్యకి దూరి, సీట్ల క్రింద శుభ్రం చేయసాగాడు. వాడలా ఆ మురికినంతా శుభ్రం చేస్తూ వుంటే నా కడుపులో దేవినట్లయింది. 'కోటి విద్యలు కూటికొరకే', అని పెద్దలు వూరికే అనలేదనిపించింది. వాడు పని పూర్తి చేసి దీనంగా అందరివైపు చేయి సాచాడు.*

వాని ఆయుధం. శ్రీకృష్ణునికి చక్రంలా, అర్జునునికి పాశుపశాస్త్రంలా, ఇంద్రునికి వజ్రాయుధంలా. ఆ మహా పురుషులు తమ అపూర్వ ఆయుధాలతో దుష్ట సంహారం చేశారు. అలాగే వీడు ఆ గుడ్డ పేలిక అనే ఆయుధంతో మురికి, అభుశ్రమ తలను రూపుమాపుతున్నాడు. కానీ చదువుకోవలసిన ఈ వయసులో వాడు కడుపు నింపుకోవడం కోసం ఈ పని చేస్తున్నాడు. వాని బంగారు భవిష్యత్తును పణంగా పెట్టి వాన్ని ఈ బురదలోకి దించిన వాని తల్లి దండ్రుల మీద నాకు చెప్పలేనంత కోపమొచ్చింది.

'నీ పేరేమిటి?' నేనడిగాను.

'తెలీదు'.

'పేరు తెలీకుండా ఎలా?'

"ఆ అవసరం రాలేదు. మా స్నేహితుల మంతా, ఒకర్ని ఒకరం, ఏరా, రారా, పోరా, అనో, పొడుగోడా, పొట్టోడా, కుంటోడా, గుడ్డోడా అనో పిలుచుకుంటాము".

'మీ అమ్మా, నాన్నా...'

"తెలీదు".

"మీదేవూరు?"

"నాకు తెలిసినప్పటి నుంచి ఈ విజయవాడ రైల్వే స్టేషన్‌లోనే వున్నాను".

"నీకు అందరిలా చదువుకోవాలనీ, మంచి బట్టలు వేసుకోవాలనీ, గౌరవంగా బ్రతకాలనీ లేదా?"

వాడేదో క్రొత్త భాష వింటున్నట్లు వింతగా, ఆశ్చర్యంగా చూడసాగాడు.

"అవన్నీ మాకెలా వస్తాయి?" వాని మాటల్లో ఒక నిరాశ, నిర్వేదం ధ్వనించాయి.

"పోనీ అవన్నీ నేనిప్పిస్తాను. నాతోపాటు వస్తావా?"

"అమ్మో! నేను రాను. నాకిక్కడే బాగుంది".


"ఇంతకంటె బాగుంటుంది. నీకు మంచి తిండి, బట్టలు ఇస్తారు. నువ్వు బాగా చదివి పెద్దవాడివై పెద్ద ఉద్యోగం చేయొచ్చు. నిన్ను అందరూ గౌరవంగా చూస్తారు".

వాడు ఏమీ మాట్లాడకుండా మౌనంగా నిలబడ్డాడు. తుదకు వాన్ని ఎలాగో ఒప్పించి నా వెంట తీసుకువెళ్ళాను. నేను ఉద్యోగం చేస్తున్న వూర్లోనే హాస్టల్లో చేర్పించి అక్కడే ఐదవ తరగతిలో చేర్చాను. వానికి 'చైతన్య' అని పేరు రాయించి, గార్డియన్‌గా నా పేరు, అడ్రసు రాశాను.

వారం. రోజుల వరకు వాడు ఎలాగో వున్నాడు. స్వేచ్ఛా విహంగాన్ని పంజరంలో బంధించినట్లయింది. అందుకే అవకాశం చూసుకుని చెప్పకుండా పరారయ్యాడు.

"అలాంటి బజారు పిల్లలను బాగు చేయడం వాళ్ళని పుట్టించిన బ్రహ్మతరం కూడ కాదు. ఎందుకు మాష్టారూ! అంత శ్రమ పడతా"రంటూ ఉచిత సలహాలిచ్చి అందరూ నన్ను నిరుత్సాహపరచారు. శాంతి కూడ విసుగ్గానే అంది, "మనకెందుకొచ్చిన గొడవండీ! ఎవరి అదృష్టానికి ఎవరు బాధ్యులు? వదిలేయండి". కానీ నా పట్టుదల, మొండితనం శాంతికి తెలియంది కాదు. అందుకే మరింకేమీ మాట్లాడలేదు.

మరుసటి రోజు సెలవు కావడంతో నేను వాన్ని వెతుక్కుంటూ మళ్ళీ విజయవాడ రైల్వే స్టేషన్ చేరుకున్నాను. వాని అదృష్టమో, నా అదృష్టమో, వాడు ప్లాట్‌ఫాంపైనే దొరికాడు. వాడు నన్ను చూసి పరుగెత్తలేదు. అంటే, ఇదంతా వాని మంచికోసమే నన్న భావం వానిలో ఏ మూలో కలిగిందనిపించింది. నా పెదాలపై విజయ దరహాసం. వాడు కూడ ప్రతిగా నవ్వాడు. మారు మాట్లాడకుండా మళ్ళీ నా వెంట వచ్చాడు. అంతే, తర్వాత వాడు మడమ త్రిప్పలేదు. స్కూలు వదలగానే మా ఇంటికి వచ్చి తెలియనివి చెప్పించుకునేవాడు. శ్రద్ధగా చదువుకునేవాడు. మొదట్లో




నాలుగైదు నెలలు చదువులో వెనకపడ్డా మెల్లగా పుంజుకున్నాడు.

కాలం వేగంగా పరుగెడుతోంది. చైతన్య తొమ్మిదవ తరగతికి వచ్చాడు. ఈ మధ్యలో నాకు దూరంగానే ట్రాన్స్ ఫర్ అయింది. అయినా చైతన్య గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వున్నాను. వాడు పదవ తరగతికొచ్చేటప్పటికి నేను రిటైరయ్యాను.

మేము హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్న మా పెద్దబ్బాయి దగ్గరికి వచ్చేశాము. చైతన్య పదవ తరగతి ఫస్ట్‌క్లాసులో, మంచి మార్కులతో పాసయ్యాడని తెలిసింది. మా పెద్దబ్బాయి బెంగుళూరులో మరో కంపెనీలో చేరాడు. మేము కొన్ని నెలలబాటు ఢిల్లీలో వున్న మా చిన్నబ్బాయి వద్ద వున్నాము. ఇలా చైతన్యకూ, మాకూ మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది. వూహించకుండా అలాగే సంవత్సరాలు గడచిపోయాయి. అయినా వాడు నిత్యం నా మనసులో మెదలుతూనే వుండేవాడు.

***

ఇలా ఆలోచనల్లో ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. హైదరాబాద్ వచ్చిందని శాంతి నిద్ర లేపేటప్పటికి మెలకువ వచ్చింది. నేను ఆదుర్దాగా లేచి సామాను క్రిందికి దించుతూ వుండగా చైతన్య వచ్చి అందుకున్నాడు. మా ప్రమేయం లేకుండానే వాడు ఒక పోర్టర్‌ను పిలిచి సామానంతా ఆటోలో పెట్టించాడు. ఆటో ఒక కాలనీలోని ఇంటి ముందాగింది.


ఇంట్లోకి అడుగు పెట్టగానే ఎదురుగా ముప్పై, ముప్పై రెండేళ్ళ యువతి చిరునవ్వుతో స్వాగతించింది. మా ఇద్దరికీ పాదాభివందనం చేసింది.

"స్రవంతి, మా కోడలు", చైతన్య చిరునవ్వుతో అన్నాడు. అమ్మాయి సంస్కారం, గుణం, కలుపుగోలుతనం మొదటి పరిచయంతోనే బోధపడ్డాయి. స్నానపానాదులు ముగించి రిలాక్స్‌డ్‌గా కూచున్నాము.

ఆ సంతోషంలో నాకూ, శాంతికీ, సంభాషణ ఎలా మొదలుపెట్టాలో బోధపడలేదు. స్రవంతే మొదటగా ప్రారంభించింది.

"తన బాల్యం గురించీ, మీ గురించీ చైతన్య నాకంతా చెప్పారు మామయ్యగారూ! మార్కులనుబట్టి తను ఇక్కడే హైదరాబాదులో నారాయణ జూనియర్ కాలేజీలో ఫ్రీ సీటు సంపాదించాడు. అప్పటినుంచీ మీకోసం ఎంతగానో ప్రయత్నించాడట. మీ ఆచూకీ తెలియలేదు. మళ్ళీ ఇన్నేళ్ళకి మిమ్మల్ని చూడగలిగాము. ఇంటర్ తర్వాత ఇక్కడే ఉస్మానియా యూనివర్సిటీలో యం.యస్సీ. మాథమాటిక్స్ చేశాడు. రెండేళ్ళు ఒక ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేశాడు. కానీ ఆయన మనసులో ఎప్పటికైనా రైల్వే ఉద్యోగి కావాలనే ఆకాంక్ష!

**కాలం వేగంగా పరుగెడుతోంది. చైతన్య తొమ్మిదవ తరగతికి వచ్చాడు. ఈ మధ్యలో నాకు దూరంగానే ట్రాన్స్ ఫర్ అయింది. అయినా చైతన్య గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వున్నాను. వాడు పదవ తరగతికొచ్చేటప్పటికి నేను రిటైరయ్యాను.**



తాను ఏ రైల్వే ప్లాట్‌ఫారాల మీద, రైళ్ళలో అనాథగా, అనామకునిగా తిరిగాడో, అక్కడే హుందాగా, తలెత్తుకుని తిరగాలనే బలీయమైన ఆకాంక్ష! పట్టుదలతో తాననుకున్నది సాధించాడు".

స్రవంతి కొంతసేపాగింది. నేనూ, శాంతీ, అపురూపంగా, అబ్బురంగా వింటున్నాము. ఇంతలో చైతన్య చెప్పసాగాడు.

"మీ పరిచయ భాగ్యంతో నా జీవితం వూహించని మలుపు తిరిగింది మాష్టారూ! తర్వాత స్రవంతి నా జీవితంలోకి రావడం మరో మలుపు. యూనివర్సిటీలోనే స్రవంతి యం.యస్సీ. ఫిజిక్స్ చేస్తూ వుండేది. యూనివర్సిటీలో పరిచయమే మమ్మల్ని ఒకటి చేసింది. స్రవంతి నాన్నగారు యూనివర్సిటీలోనే ఇంగ్లీషు ప్రొఫెసర్. ఆయన అభ్యుదయ భావాలుగల వ్యక్తి. అందుకే మా పెళ్ళికి అభ్యంతరం చెప్పలేదు. ప్రస్తుతం స్రవంతి ఒక ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తోంది".

ఇంతలో ఇద్దరు పిల్లలు కళ్ళు నులుముకుంటూ హాల్లోకి వచ్చారు. అబ్బాయికి ఆరేండ్లు, అమ్మాయికి నాలుగేండ్లు వుంటాయి. వారిని ఆప్యాయంగా ఒళ్ళోకి తీసుకున్నాము. 'మీ పేరేమిటమ్మా?'

'శాంతి'

'రఘురాం'

మా చెవులను మేమే నమ్మలేకపోయాము. కళ్ళు చెమర్చాయి. ఆరాధనగా ఆ దంపతుల ముఖంలోకి చూశాము.

"ఇంతకంటె ఏమిచ్చి మీ రుణం తీర్చుకోగలను మాష్టారూ!"

చైతన్య కళ్ళతోనే బదులిస్తున్నట్లుంది. "చైతన్య చెబుతున్నది నిజమే! మీ రుణం తీర్చుకోలేము" చైతన్యకు వత్తాసు పలుకుతూ స్రవంతి చిరునవ్వుతో చెబుతూన్నట్లుంది.

రెండు రోజులు ఎంతో ఆనందంగా గడచిపోయాయి. అనాథ బాలల చదువులకు, వృద్ధులకు, మహిళలకు వారు చేస్తున్న సహాయాల గురించీ, ఇతర సేవా కార్యక్రమాల గురించీ ఎన్నో విషయాలు చెప్పారు. మూడవ రోజు సాయంత్రం బలవంతంగా మా అబ్బాయి ఇంటికి బయలుదేరాము. వారు ససేమిరా ఒప్పుకోలేదు. రాత్రికి భోజనం చేసిన తర్వాత వెళ్ళడానికి ఎలాగో ఒప్పుకున్నారు.

భోజనం చేస్తూ వుండగా కరెంటు పోయింది. స్రవంతి లేచి కొవ్వొత్తిని వెలిగించింది. వెలిగించిన క్రొవ్వొత్తి సహాయంతో మళ్ళీ అన్ని గదుల్లోను క్రొవ్వొత్తులు వెలిగించింది.

ఒక చిరుదీపం, అనేక దీపాలను వెలిగించి చీకట్లను పారద్రోలింది. నిజమే! ఈ చైతన్య స్రవంతి ఇలా నిరంతరం ముందుకు సాగుతూనే వుంటుంది. సందేహం లేదు! నా పెదాలపై దరహాసం.